**ఆమె మాట కాదనకుండా ఉంటే, అరుంధతి ఇంటిని స్వర్గంలా తీర్చిదిద్దుతుంది.. ఇల్లెప్పుడూ నవ్వులతో కలకల లాడుతూ ఉంటుంది. మరి ఆమె మాట కాదంటేనో, నరకమే!**

**ఉన్నట్టుండి బాబుకు వచ్చిన జ్వరం ఆమెకో చేదు అనుభవమే అయింది. ఆ అనుభవం వల్ల ఆమె నేర్చుకున్న పాఠం ఏమిటి?**




నేను మధ్య తరగతి కుటుంబీకుడినే అయినా నాలు గంకెల జీత గాడిని. పైగా మీ రిద్దరు, మీ కిద్దరు అనే సూక్తిని అనుసరించిన వాడిని. ముచ్చటగా ఒక పాప, ఒక బాబు. అయినా ఏం ప్రయోజనం. నెల ఇంకా వారం రోజు లుందనగానే అప్పుకు బయలుదేరాల్సిన కర్మ పడుతుంది.

అలాగని వ్యసనపరుణ్ణి అనుకోనేరు. అబ్బే, అదేం లే దండి. కనీసం సిగరెట్టు కూడా అలవాటు లేదు. అయితే చి క్కల్లా ఎక్కడ వచ్చిందంటే మా ఆవిడ అరుంధతి ఆవిడగారి గురించే కొంచెం ఇక్కడ చెప్పాలి.

మా పె ళ్ళయిన ఈ ఎనిమిది సంవత్సరాల బట్టీ చూస్తున్నా, ఏ వస్తువు వీధిలో అమ్మకాని కొచ్చినా అరుంధతికి నచ్చిం దంటే అది అవసరమున్నా లేకపోయినా కొని ఇంట్లో పెట్టాల్సిందే.

ఆవిడే కొనుక్కొంటుంది సుమండీ, నేను కాదు. సాయం కాలం దాకా నేను ఆఫీసులోనే పడి చస్తాను కదా!

ఇరుగు పొరుగిళ్ళలో ఏ వస్తువు చూసినా తన దగ్గర అంత డబ్బు లేక పోయినా కనీసం ఇన్‌స్టాల్‌మెంట్సు మీదనైనా కొని తెచ్చి ఇంట్లో పెడుతుంది.

అది మాత్రం నాతో చెప్పే సుమండీ. ఎందుకంటే మళ్ళీ ఆ బాకీ ఎక్కడైనా అప్పయినా చేసి నేనే తీర్చాలి కదా!

జీతం తెచ్చి ఆవిడ చేతిలో పొయ్యకపోతే ఒక బాధ. పోనీ కదా అని చేతికొస్తే ఇరవై రోజులు తిరిగేటప్పటికి "ఏమండీ, ఎక్కడేనా మూడు వందలు తీసుకు రండి. ఇంట్లో సరుకులు నిండుకొన్నాయ్ చేతిలో డబ్బులు లేవు" అంటుంది.

"అప్పుడే జీతమంత అయిపోయిందా అరుంధతీ?" అంటే, "ఏం నే నేమైనా తినేసే ననుకొన్నారా లేక మా పుట్టింటికేమేనా దోచి పెడుతున్నా ననుకొన్నారా? మీకూ, మీ పిల్లలకే పెడుతున్నాను!" అంటుంది ముక్కు చీదుతూ.

"వీధిలో కొచ్చిన ప్రతి వస్తువూ కొనక పోతేనేం? డబ్బులా ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెడితే రే ప్పొద్దున పిల్లలు పెద్ద వాళ్ళు అవుతున్నారు. వాళ్ళకే అవసర మొస్తుందో అప్పు దెవరిస్తారు అరూ? కొంచెం ఆలోచించు నువ్వేం చిన్న పిల్లవా?" అని ఇంకా ఏదో చెప్పబోతూ ఉంటే మధ్యలోనే అందుకొని - "ఎప్పుడో ఏదో అవసర మొస్తుందని ఏ సరదా లేకుండా ఇప్పుడు ముష్టి బతుకు బతకమంటారా?" అంటూనే ఏడుపు మొదలు పెట్టింది ఒకసారి.

అలాగే ఇన్‌స్టాల్‌మెంట్సులోనే ఫ్రిజ్, టీ.వీ మొదలైనవి కొంది. ఇంకా ఆ బాకీలు తీరుస్తూనే ఉన్నాం.

"మన స్థాయికి బ్లాక్ అండ్ వైట్ చాలు. కలర్ దేనికి అంత డబ్బు పెట్టి?" అంటే, "నాలుగు రోజులు హంగర్ స్ట్రైక్ చేసి మరీ విజయం సాధించింది.

ఆమెను వా రించడం అంటే కొరివితో తలగోక్కున్నట్టే. అలా అని ఆమె దగ్గర నాకు భయం అనుకోనేరు. అలా అనుకొంటే మీరు పొరపడ్డట్టే!

ఆమె మాట ఏది కా దన్నా మళ్ళీ అవుననే దాకా ఇంట్లో నరకాన్ని సృష్టిస్తుంది. అయిన దానికీ, కాని దానికీ పిల్లల వీపులు విమానం మోత మోగుతూ ఉంటాయి. వాళ్ళ ఆలనా పాలనా గాలి కొదిలేస్తుంది. మూ డంకె వేస్తుంది.

నే ననలే శాంతి కాముకుణ్ణి. ఎప్పుడూ వాదాలు, గొడవలు అంటే నా కిష్టం ఉండదు. ఇరుగు, పొరుగుల కళ్ళల్లోనికి, చెవుల్లోకి మన సంగతులు వెళ్ళకుండా గుట్టుగా ఉం డాలన్నది నా తత్వం.

ఇలాంటి ఎన్నో సంఘటనలు జరిగిన మీదట ఇక ఆమె మాటకి ఎదురు చెప్పడం మానుకొన్నా.

ఈ మధ్య కూడా ఒక సారి ప క్కింటి పిన్ని గా రింటికెళ్ళి ఆవిడ బెంగుళూరు నుంచి తెప్పించుకొన్న పట్టు చీరలు చూసి వచ్చింది. ఆ రాత్రే నా కన్నం పెడుతూ "ఏమండీ, సాయంకాలం ప క్కింటి పిన్ని గా రింటికి వెళ్ళానండీ". అంది ప్రస్తావనకు నాంది పలుకుతూ.

నా గుండెల్లో అప్పుడే రాయి పడింది. "వెళితే... ఏమయింది?" అన్నాను మెల్లగా. 'ఏం బాంబు పేలుస్తుందో' అనుకొంటూ.

"అబ్బే ఏం లే దండి. ఆవిడ వాళ్ళ తమ్ముడి చేత బెంగుళూరు నుంచి రెండు పట్టు చీరెలు, తెప్పించుకొంది. ఎంత బా గున్నాయను కొన్నారు!" అంది అరమోడ్పు కళ్ళతో వాటి అందాన్ని తలచుకొంటూ.

"ఆహా, అలాగా!" అన్నాను నిర్లిప్తంగా.

"ఒకటి మిరపపండు రంగు ఎరుపు, ఒకటి బంతిపువ్వు రంగు పసుపు, చెయ్యి వెడల్పు జరీతో మెరిసిపోతున్నాయనుకోండి" అంది మళ్ళీ అదే పారవశ్యంతో.

ఆవిడ నా పారవశ్యం నుంచి ఎందుకు దూరం చెయ్యాలని మాట్లాడకుండా అన్నం తింటూ ఉంటే నా దగ్గర నుంచి సమాధానం లేకపోవడం చూసి ఆ ఆనం దాన్నుంచి బయటకొచ్చినట్లుంది, "ఏరి మాట్లాడరేం?" అంది.

"ఏం మాట్లాడను? కొనుక్కొన్నది ఆవిడ. చూసి వచ్చినదానివి నువ్వు. ఈ గోంగూర పచ్చడి ఈ రోజు చాలా బాగా కుదిరిందోయ్!" అన్నాను మాట మారుస్తూ.

"అబ్బో... అరుంధతి - ఇం కా ఎవ రన్నానా?"

"చాల్లెండి. ఎప్పుడు తిండిరంధే! అందులో బంతిపువ్వు రంగుది నేను తీసుకొంటాను" అంది గ్లాసులో నీళ్ళు పోస్తూ.

ఉలిక్కి పడ్డాను. "ఆవిడ కోసం తెప్పించుకొన్నది నీ కెందు కిస్తుంది?" అడిగాను కాస్త ధైర్యంగా.

"ఆవిడ కా రంగు ఇది వరకే ఉం దట. వాళ్ళ

తమ్ముడి కా సంగతి తెలిక తీసుకొచ్చాడట. అందుకే నన్ను తీసుకోమన్నారు.''

''ఓహో, అదా సంగతి! అందుకే నీ కంట గట్టి యాలను కొంటున్నది'' అని మనసులోనే అనుకొని పైకంటే అ దొక తంటా.

''ఇప్పు డది నీ కెందుకు అరుంధతీ మొన్ననేగా దసరాకి పట్టు చీర కొనుక్కొన్నావ్. మళ్ళీ ఇంతలోనే.''

''ఆ కొన్నారు ముష్టి ఎనిమిది వందల పట్టు చీర!''

''ఏమిటి! ఎనిమిది వందలు ముష్టి ఎనిమిది వందలా?'' తెల్ల బోయాను అరుంధతి మాటలకి.

''డబ్బు కూడా ఇప్పుడే ఇవ్వక్కర లేదు లెండి! ఆరు ఇన్‌స్టాల్‌మెంటుల్లో ఇచ్చేయెచ్చు. పద్నాలుగు వంద లేగా ఎంతలో తీరి పోవాలి?''

అరుంధతి మాటలతో నా కోపం నసాళాని కంటింది. అయినా కాస్త నిగ్రహించుకొంటూనే - ''ఇన్‌స్టాల్‌మెంట్... ఇన్‌స్టాల్‌మెంట్...



ఇన్‌స్టాల్‌మెంటు! నా జీతం అంతా ఈ ఇన్‌స్టాల్‌మెంట్సు కట్టటానికే అయిపోయేటట్టుంది. ఇంత సంపాదించుకొంటూ ప్రతి నెలా అప్పు కెళుతుంటే నా తోటి ఉద్యోగస్తులంతా నన్ను చూసి నవ్వుకొంటున్నారు'' అన్నాను బాధగా.

''మా నాన్న చూసి చూసి ఈ ముష్టి సంబంధం చేశాడు. ఒక అచ్చటా లేదు ముచ్చటా లేదు'' అంటూనే చేతిలో ఉన్న కూర గిన్నె నేల కేసి కొట్టి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

అది మొదలు మూడు రోజులు ఇంట్లో నరకాన్ని సృష్టించింది అరుంధతి.

ఆ బాధ పడలేక నేను 'సరే చీర తెచ్చుకో' అనే దాకా అలాగే ఉంది ఇల్లు.

అందుకే ఏ దయితే అదే అయిందని ఆమె మాటే వేద వాక్కులా జీవితాన్ని వెళ్లదీస్తున్నా.

ఏ మాట కా మాట చెప్పొద్దూ? ఆమె మాట కా దనకుండా ఉంటే అరుంధతి ఇంటిని స్వర్గంలా తీర్చిదిద్దుతుంది. ఆదర్శ దంపతులు అనేట్టు ఉంటుంది. ఇ ల్లెప్పుడు నవ్వులతో కలకలలాడుతూ ఉంటుంది.

రోజులు పోతున్నాయ్.

వెళ్ళక అవి మన కోసం ఆగుతా యా బాబూ?

ఆ రోజు ఆఫీసు పని అయ్యేటప్పటికి రాత్రి ఎనిమిదయింది. ఇంటికి చేరేటప్పటికి మా అమ్మాయి సుమ గుమ్మంలోనే ఏడుపు ముఖంతో ఎదురైంది.

నా గుండెల్లో చెప్పరాని భయం ఏం జరిగిందో అని.

''ఏం అమ్మ సుమా, ఒక్క దానివి చీకట్లో బయట కూర్చొని ఏడుస్తున్నావేం?'' అన్నాను అనునయంగా దగ్గిరకు తీసుకుంటూ.

''నాన్నా - తమ్ముడు'' అంటూ బావురుమంది.

''ఏం తమ్ముడి కే మయింది?'' అన్నాను కంగారుగా.

''తమ్ముడికి జ్వరం - అసలు మాట్లాడటం లేదు. అమ్మ కూడా ఏడుస్తూంది'' అంది సుమ.

ఒక్క ఉదుటన లోపలికి వెళ్ళాను.

నాలుగేళ్ళ ప్రభు స్పృహ లేకుండా మంచం మీద పడి ఉన్నాడు. ఒళ్ళు జ్వరంతో కాలిపోతోంది.

నన్ను చూసి అరుంధతి కళ్ళ నీళ్ళు పెట్టుకొంటూ ''ఏమండీ, మన బాబు మాట్లాడటం లే దండి. ఒళ్ళు కాలిపోతోంది'' అంది.

''నేను ఆఫీసుకెళ్ళేటప్పటికి బాగానే ఉన్నాడుగా'' అన్నాను.

''అవునండి. మధ్యాహ్నం రెండు గంటలప్పుడు తల నొప్పిగా ఉందని ఏడ్చాడు. తరువాత ఒళ్ళు తెలీని జ్వరం అప్పటి కప్పుడే వచ్చేసింది'' అంది అరుంధతి.

''గాభరా పడకు. ఇప్పుడే రిక్షా తీసుకొస్తా. డాక్టరు దగ్గిరకెళదాం. నువ్వు ఇం దాకే నాకు ఫోన్ చెయ్యాల్సింది'' అంటూనే సమాధానం కోసం ఎదురుచూడక రిక్షా కోసం పరుగెత్తా.

మా అబ్బాయి ప్రభును పది రోజులు హాస్పిటల్‌లో ఉంచాం. చెప్పిన మం దల్లా కొన్నాం. డబ్బు మంచి నీళ్ళలా ఖర్చయిపోతూంది. దాచుకొన్న దేమీ లేకపోవటం చేత, పుట్టిన చో టల్లా అప్పు తెస్తూనే ఉన్నాను.

అరుంధతి చిక్కి శల్యమయింది. ముఖంలో కళ లేదు. అప్పు కోసం నేను పడే పా ట్లన్నీ ఇప్పుడు ఆమెకు గ్రహింపు కొస్తున్నాయ్.

ప్రభు ఇప్పు డిప్పుడే కొంచెం కోలు కొంటున్నాడు. ఆ రోజు డాక్టరు గారు పిలిచి ''చూ డండి మూర్తి గారూ, రేపు మీ అబ్బాయిని తీసుకొని పోవచ్చు. ఇంకేం ఫరవాలేదు. సాయం కాలం మీరు కనిపిస్తే బిల్లు సెటిల్ చే సేస్తాను'' అన్నారు.

ఒక మూల అబ్బాయికి నయమయిందన్న సంతోషం. ఒక వైపు ఎంత బి ల్లవుతుందో అప్పు కూడా ఇం కెక్కడ దొరికేటట్లు లే దన్న బెంగ.

సాయం కాలం రానే వచ్చింది. రెండు వేల బిల్లు [మందు ఖర్చు కాక] చేతిలో పెట్టారు.

రాత్రి పది దాకా అప్పు కోసం తిరుగుతూనే ఉన్నాను. కానీ కాదు, పరక కాదు, రెండు వేలు. ఒక్క సారి ఎలా దొరుకుతా యి?

పోనీ ఏదైనా అమ్ముదా మంటే కొన్న ధరకు సగం కూడా రాని వస్తువులే.

ఏం చెయ్యాలో తోచని స్థితి. రాత్రి పదకొండు గంటలైంది. హాస్పిటల్ బయట చెట్టు కింద రాతి మీద కూర్చున్నాను ఆలోచిస్తూ.

''ఏమండీ!'' అరుంధతి పిలుపు.

''ఏమిటి అరుంధతి?'' అన్నాను తలెత్తుతూ.

పిడికిలి మూసి చెయ్యి నా ముందుకు చాపింది.

''ఏమిటిది అరుంధతీ'' అన్నాను పిడికిలి వంక చూస్తూ.

''పెళ్ళిలో మీరు నాకు పెట్టిన గొలుసు. ఇది తీసుకెళ్ళి తా కట్టు పెట్టో, అమ్మో డబ్బు తీసుకు రండి'' అంది రెండు పేటల గొలుసు నా చేతిలో పెడుతూ.

''అరుంధతీ. ఇ దొక్కటేగా నీ కున్నది! ఇది ఇచ్చేస్తున్నావా?'' అన్నాను ఆశ్చర్యంతో.

''మన పిల్ల వాడికన్నా నా కిదేం ఎక్కువ కా దండీ. వాడికి నయం అయింది నా కదే చాలు. వాడిని హాస్పిటల్‌లో చేర్చింది మొదలు ఇప్పటి దాకా మీరు అప్పు కోసం పడే పాట్లన్నీ నేను గమనిస్తూనే ఉన్నాను. నా మూర్ఖత్వం వల్లనే కదా ఇప్పుడిన్ని పాట్లు పడుతున్నారు'' అంది తలవంచుకొంటూ.

''ఇప్పు డవన్నీ ఎందుకులే అరుంధతీ? ఈ గొలుసు ఇప్పుడు అమ్మేస్తే నేను మళ్ళీ చేయించగలనో లేదో'' అన్నాను అరుంధతీ మొఖంలోకి చూస్తూ.

''నాకేం వ ద్దండి. ఇది అమ్మి ముం దీ అప్పులు తీర్చెయ్యండి. మీరు చెప్పినా వినకుండా అనవసరమైనవన్నీ కొని ఆడంబరాలకు పోయి పైసా నిలవ చెయ్యలేదు. దానికి శిక్ష నేను అనుభవించవలసిందే! ఇక మీ రేం ఆలోచించకండి'' అంది అరుంధతి. ముఖంలో ఏదో దృఢ నిశ్చయం కనిపిస్తూంది.

''ఇప్పు డైనా అరుంధతిలో మార్పు వస్తే ఇక కావలసిందేముంది'' అనుకొంటూ గొలుసును జేబులో వేసుకొని నిశ్చింతగా బయటికి నడిచాను.